**ఉదయం లేచినప్పుడు కర్నల్ ఫ్రాంక్లిన్ హోవార్డ్ తల పగిలి పోతోంది. చిన్న చిన్న సమ్మెటలతో కొన్నివేల మంది మనుషులు తల మీద బాదుతున్నట్టుగా అనిపించింది తల నొప్పి.... టెరిబుల్ హాంగోవర్... బ్లడీ హెల్!!!**

# లాస్ట్ పెరేడ్

**– కె. సదాశివరావు**



**అంతకు ముందు రాత్రి ఆఫీసర్స్ క్లబ్‌లో బ్రిటిష్ ఆఫీసర్స్ అందరూ విపరీతంగా ఆల్కాహాలిక్ డ్రింక్స్ తాగి వారి మనసుల్లో ఆవరిస్తున్న గుబులు, బెదురు, ఒంటరితనం, అసహాయత... ఇవన్నీ కలిసిన భావాలని మరిచి పోవడానికి కృషి చేశారు... సంయుక్తంగా... ఆ ప్రయత్నం నిరుపయోగం... యూస్‌లెస్... But they could not help it!**

మొదటిసారిగా ఆఫీసర్స్ క్లబ్‌లో నవ్వులు వినిపించలేదు. జోక్స్ వేసే మూడ్‌లో ఎవరూ లేరు. ఆ సాయంత్రం భరించరాని ఏకాంతపు సాయంత్రం. **(Silent evening! longest evening in their lines!!!)**

బేరర్స్ నిశ్శబ్దంగా ఆర్డర్స్ తీసుకుంటూ ప్రతీ రోజూలాగే అణకువతో ప్రవర్తిస్తున్నారు. ఇంగ్లీషు దొరలు ఇలా ఎందుకున్నారో వాళ్లకి తెలుసు. సర్వెంట్స్ అందరికీ అప్పటికే తెలిసిపోయింది. తమ దేశానికి స్వాతంత్ర్యం రాబోతోందని... బ్రిటిష్ దొరలు... బ్రిటిష్‌రాజు తమకు పాలకులుగా వుండబోరని... అంటే ఏమిటో వాళ్లకి ఏ మాత్రం అవగాహన లేదు. దేశంలోని అందరు ప్రజల్లాగే వాడూ సంతోషంగా వున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిందన్న సంబరమేగాని దాని అర్థం చాలా మందికి తెలియలేదు. ప్రపంచంలో భారతదేశ పరంగా ఈ శతాబ్దంలో జరుగుతున్న అతి ముఖ్యమైన సంఘటన అనీ, అన్ని దేశాలూ ఈ పరిణామాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయనీ, చరిత్రకారులు విశ్లేషిస్తున్నారనీ... కొందరికి తెలుసు. కాని నిజానికి ఈ అతి ముఖ్యమైన సంఘటన వల్లనే దేశ విదేశాల ప్రజల్లో ఎవరికి ఏమి జరుగబోతున్నది అన్నది ఎక్కువ మందికి అంతుబట్ట లేదు. అప్పటికది చెప్పడానికి వీలు లేదు.

బొంబాయిలోని బ్రిటిష్ ఆర్మీ ఆఫీసర్స్ క్లబ్‌లో ఇంగ్లీషు దొరలు తమాషాగా ప్రవర్తిస్తున్నారు. మామూలుగా జోవియల్‌గా వుండి బూతు జోకులు చెప్పి అందర్నీ నవ్వించే కెప్టెన్ మార్షల్ దొర విచారంగా ముభావంగా వున్నాడు. సీరియస్‌గా క్రికెట్ ఆట గురించి మాట్లాడే మేజర్ రేనార్డ్ దొర బెల్లం కొట్టిన రాయిలా కూచుని తన ఎదురుగా వున్న విస్కీ గ్లాసులోకి కన్నార్పకుండా చూస్తున్నాడు. అప్పటికే ఆరు పెగ్గులు లాగించి వున్నాడు. బేరర్స్‌కి అంతుబట్టలేదు. ఇంకో రెండు పెగ్గులు వేసి అక్కడే వాంతులు చేసుకుని పడి పోతాడో ఏమిటోనని వాళ్లు గాబరా పడుతున్నారు. ఇంకా ఇతర బ్రిటిష్ ఆఫీసర్లు వారి వారి అలవాట్లకి భిన్నంగా క్లబ్ వరండాలో కూర్చుని రక్త వర్ణంలో అస్తమిస్తున్న సూర్యుడి వంక నిస్పృహాయంగా చూస్తూ వుండిపోయారు.

చీకట్లు కమ్మేక క్లబ్ లైట్స్ వేసిన కొద్ది నిమిషాల్లో వారిలో కొంచెం చైతన్యం వచ్చింది.


"రామ్‌సింగ్!"

"జీ సాబ్"

"విస్కీ అండ్ సోడా"

"ఠీక్ హై సాబ్"

"దేఖో రామ్ సింగ్!"



రేపు ఇండియాకి స్వాతంత్ర్యం రాబోతున్నది. నిజానికి అర్థరాత్రి రాబోతూంది స్వాతంత్ర్యం.

అప్పటికే లార్డ్‌మౌంట్ బాటన్, లేడి ఎడ్వినా మౌంట్ బాటన్ ఢిల్లీలో రంగంసిద్ధం చేశారు. మొదటి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆ రాత్రి అధికారం చేపట్టబోతున్నాడు. కోట్లాది మంది భారతీయులు బ్రిటిష్ రాజ్యపాలన నుండి విముక్తులవుతారు. మహాత్మాగాంధి, ఇతర దేశ నాయకులు శ్రమించి కలలు కన్న స్వాతంత్ర్యం రేపు నిజమౌతుంది. ఈ చారిత్రాత్మక సంఘటన వల్ల ఎన్నో కోట్ల మంది జీవితాలు మారిపోతాయి.

ముఖ్యంగా ఇన్నాళ్లూ ఈ దేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయుల పరిస్థితి తారుమారౌతుంది.

ఒకనాటి పాలకులు!

రేపటి నుండి అధికారం కోల్పోయి, సామాన్యపు విదేశీయులై ఓడిపోయిన వాళ్లలా తమ దేశానికి వెళ్లిపోతారు.

వెళ్లిపోవాలి!

వెళ్లక తప్పదు!



"సాబ్?"

"రమ్ అండ్ వాటర్"

"అచ్చా సాబ్"

ఆర్డర్స్ ప్రకారం డ్రింక్స్ వచ్చాయి.

క్లబ్ బయట చీకట్లు కమ్ముకున్నాయి. ఆ రోజు గోల్ఫ్ కోర్సు నిర్మానుష్యంగా వుంది. రెడీ బోయ్స్ పూరికే కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. టెన్నిస్ కోర్టులలో ఎవరూ ఆట ఆడలేదు. చీకటి పడగానే మార్కర్లు నెట్స్ తీసేసి లైట్లు ఆర్పేశారు.

లాన్స్ మీద కేన్ చెయిర్స్‌లో కొందరు దొరలు ఎదురు ముదురుగా కూర్చుని డ్రింక్స్ సిప్ చేస్తున్నారు మౌనంగా.

దొరసానులందరూ ఇళ్ల దగ్గరుండి సామాన్లు పాక్ చేసుకుంటున్నారు.

అంతా నిశ్శబ్దం!

ఆ రోజు ఆగస్టు 14, 1947.

కల్నల్ హోవార్డ్ ఎవరి రోజులు ఇలావుంటాయని ఎన్నడూ వూహించ లేదు. నిజంగా ఈ రోజు వస్తుందని అతడు ఎన్నడూ కలగన లేదు. అతడు, ఇతర బ్రిటిష్ ఆఫీసర్లు క్లబ్‌లో స్వాతంత్ర్యంకోసం కృషి చేస్తున్న ఇండియన్ నాయకుల మీద జోక్స్ వేసి నవ్వుకునేవారు. ఆ నవ్వులో వెటకారం, వ్యంగ్యం, చులకన భావం కలిసి వుండేవి.

"నేకెడ్ ఫకీర్" మహాత్మాగాంధి ముద్దు పేరు.

వందేమాతరం పాటని పారడీ చేసి బూతు డ్రింకింగ్ సాంగ్‌లా పాడుకునేవారు.

కాని వారి కళ్ల ముందు జరుగుతున్న చరిత్ర వాళ్లనమ్మకాల్ని తొలిచేస్తున్నది. వారి విశ్వయాన్ని, నిబ్బరాన్ని సమూలంగా నాశనం చేస్తూ, ఇన్నాళ్లూ వారు పదిలంగా కాపాడుకుంటున్న వారి అభిప్రాయాల్ని కాలరాస్తూ, నేకెడ్ ఫకీరే గెలిచాడు. ఆ భయంకర సత్యం వాళ్ల మనో విశ్వాసాన్ని దెబ్బతీసింది. గాంధి తమని ఓడించాడు అన్నది తిరుగులేని నిజం!

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి రాహుకాలం దాపురించింది.

బ్రిటిష్‌రాజ్ అంతానికి ఇది నాంది!

తమకు స్వర్ణయుగం రోజులు అయిపోయాయి.


తమ జీవితకాలంలో మళ్లీం తిరిగిరావు.

ఆ రాత్రి వారికి చరమ రాత్రి!

కాళరాత్రి!

విపరీతంగా తాగిన ఆల్కహాల్‌లో నిద్రపట్టక ఒకవేళ నిద్రపడితే అర్థం పర్థం లేని పీడకలలతో వారు ఆ రాత్రి గడిపారు.

ఉదయాన్నే బేరర్ కాలూరామ్ మామూలుగా కల్నల్ హోవార్డ్‌ను లేపాడు.




టేబుల్ మీద పొగలు కక్కుతున్న స్ట్రాంగ్ టీ వుంది. దానిని చూడగానే ప్రాణాలు లేచి వచ్చాయి. కళ్లు మండుతున్నాయి. కణతలు అదురుతున్నాయి. పొట్ట సంగతి సరేసరి. పరిస్థితి చాలా భయంకరంగా వుంది.

కళ్లు తెరిచి బేరర్ వంకకి చూశాడు. బేరర్ ప్రవర్తనలో ఏమైనా మార్పు వుందేమోనని చూశాడు హోవార్డ్. వాడి కళ్లల్లో కాన్ఫిడెన్స్‌తో కూడిన నిరు మెరుపు కొట్టవచ్చినట్టుగా వుంది. బహుశా తాను వూహిస్తున్నానేమోననుకున్నాడు హోవార్డ్.

ఇన్నాళ్లూ తనకి సర్వెంట్.

ఈ రోజుతో ఆ బంధం తీరిపోతుంది.

"గుడ్ మార్నింగ్ సాహెబ్" అన్నాడు బేరర్ కాలూరామ్.

"మార్నింగ్ కాలూ"

బేరర్ పొగలు కక్కుతున్న టీ మగ్ నిండా పోసి చేతికి ఇచ్చాడు. తలలో నాలుగు బ్రాస్ బాండ్‌మేళాలు ఏకంగా మోగుతున్నట్టుగా వుంది. వేడి టీ తాగి మంచం మీదికి వాలిపోయాడు హోవార్డ్.


"ఓ లార్డ్!" అంటూ స్వల్పంగా మూలిగాడు. వేడి టీ పొట్టలోనికి పోయాక తలలోని అదురు కాస్త తగ్గినట్టుగావుంది.

కాలూరామ్ మరో అరమగ్ టీ పోశాడు.

లేచి అది కూడా పూర్తి చేశాడు హోవార్డ్.

కాలూరామ్ తనవంకే చూస్తూ నిలబడ్డాడు.

"క్యా బాత్‌హై కాలూ?" అడిగాడు.



సంచలనం

"మీ 'తన్నేవాడిదే రాజ్యం' చిత్రం గొప్ప సంచలనం సృష్టించిందట గదా!" నిర్మాత నిరంజనరావ్‌ని అడిగాడు ఓ పత్రికా విలేకరి.

"సినిమా విడుదలైన రోజే ఆఖరి రోజవడం సంచలనం కాక మరేమిటి?" నిర్మాత నిరంజనరావ్ జవాబిచ్చాడు.

—వై. వివేకానంద (దాదిరెడ్డిపల్లె)

"ఇవేళ పెరేడ్ వుందిసాబ్. అమ్మగారు గుర్తు చెయ్యమన్నారు"

"గ్రేట్‌స్కాట్! నిజమే ఇండియన్ ఆర్మీకి బ్రిటిష్ ఆర్మీ ఫార్మల్‌గా అధికారాన్ని హేండోవర్ చేయాలి. ఆ పెరేడ్ కమాండ్ చేసే బాధ్యతని తననెత్తి మీద వేసినట్టు ఆర్మీ హెడ్ క్వార్టర్స్ నుంచి ఓ ఆర్డర్ వచ్చింది.

ఈ హేంగోవర్ గొడవలో ఆవిషయాన్ని దాదాపు మరిచిపోయాడు కల్నల్ హోవార్డ్. ఇంకా నయం కొంపలు మునిగేవి.

"ఫ్రాంక్? లేచావా?" అని అరిచింది ప్యాట్రీషియా క్రింద నుండి.

"యస్ డార్లింగ్" సమాధానమిచ్చాడు హోవార్డ్.

"ఆ పెరేడ్ పూర్తయినాక ఇంటికి త్వరగా వచ్చెయి డియర్. పేకింగ్‌లో నాకు సాయం కావాలి. నా నడుములు విరిగి పోతున్నాయ్ ఈ పనితో. వింటున్నావా?" మళ్లీ అరిచింది.

"ఎస్. ఎస్.వింటున్నాను. అలాగే పాట్. లెట్ మీ గెట్ రెడీ డియర్" మంచం మీద నుండి లేచాడు.

"కాలూ పెరేడ్‌కి సెరిమోనియల్ యూనిఫారమ్ సిద్ధం చేయమని చెప్పు"

"అచ్చా సాబ్" కాలూరామ్ వెళ్లిపోయాడు.

బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. షేవింగ్ సెట్ అంతా సిద్ధంగా వుంది. స్నానానికి వేడి నీరు టబ్‌లో పొగలు కక్కుతూ రెడీగా వుంది.

షేవ్ చేసుకుంటుండగా ఆలోచనలు ముట్టుముట్టాయి.

ఇండియన్ ఆర్మీకి బాధ్యత అప్పగించిన తర్వాత తెల్లవాళ్ళంతా కలసి పేక్ చేసుకుని ఇంటికి వెళ్ళిపోవాలి. తమ దేశానికి వెళ్ళిపోవాలి.

ఏ ఇంటికి?

ఏ దేశానికి?

హోవార్డ్‌కి తెలియలేదు.

ఫ్రాంక్లిన్ హోవార్డ్ కుటుంబీకులు తరతరాలుగా ఇండియాలో మిలిటరీ ఆఫీసర్లుగా వున్నారు. తండ్రి, తాత, ముత్తాత అందరూ ఇండియాతో సంబంధం వున్నవారే. ఇక్కడే పుట్టి ఇంగ్లండ్‌లో చదువుకుని తిరిగి ఇండియా వెళ్ళి అక్కడ పనిచేసి అక్కడే చని పోయిన అతడి పూర్వీకుల, బంధువుల సమాధులు ఇండియాలో నలుమూలలా వున్నాయి. కలకత్తా, మద్రాసు, బొంబాయి, లక్నో, ఢిల్లీ, కాన్పూర్, మీరట్... ఇంకా ఎన్నో నగరాల్లో వున్నాయి, ఎక్కడెక్కడో వున్నాయి. అతడి బంధువులు, కజిన్స్, అంకుల్స్, ఆంట్స్... అందరూ ఇండియాలో బతికినవారే. వారికి ఇంగ్లండ్‌తో వున్న సంబంధం చాలా తక్కువ. ఎప్పుడేనా సెలవుకి ఇంగ్లండ్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళు అక్కడ కొత్తగా ఫీలయేవారు. ఇంగ్లండ్‌లోని బంధువులకి వీళ్ళు విచిత్రంగా పల్లెటూరి బైతుల లాగా, వారి మానర్స్ సభ్యతా ప్రపంచానికి దూరంగా, మొరటుగా వున్నట్టుగా అనిపించేవి.

"కోయీ హై?" అనే వాళ్ళ కేకలు విచిత్రంగా వినిపించేవి. వీళ్ళని 'కోయీహైలు' అని పిలిచేవారు.

హిందీ, ఉర్దూ, తెలుగు, తమిళం, మరాఠీ, పర్షియన్ ముక్కలు కలిపిన వాళ్ళ భాష, యాస సిసలైన ఇంగ్లీషువాళ్ళకి అనాగరికంగా, కఠోరంగా, సంకరంగా తోచేది. ఉచ్చారణలో ఎన్నో లోపాలు వున్నట్టుగా అనిపించేవి. వీళ్ళ భాషని 'చీచీ ఇంగ్లీష్' అనేవారు.

**తెలియదా!**

"ఏరా! శ్యామూ! నిన్న శనివారం స్కూల్‌కు రాలేదు" అడిగారు మాస్టారు శ్యామ్‌ని.

"హెడ్మాస్టరు లేనప్పుడు మీరు క్లాస్‌కి వస్తున్నారా! అలాగే మా నాన్నగారు ఊళ్ళో లేనప్పుడు నేను స్కూల్‌కి ఎలా వస్తాను? మీకా మాత్రం తెలియదూ!" జవాబిచ్చాడు శ్యామ్.



ఇండియా మనుషులు అని పిలిచేవారు వీళ్ళని.

ఇంగ్లండ్ వాతావరణంలో వీళ్ళు ఇమడలేక ఇండియాకి సాధ్యమైనంత త్వరగా వచ్చేసేవారు.

ఇండియాలోని దుమ్మూ, ధూళీ, రోగాలు, దారిద్ర్యం, కలరా, స్మాల్‌పాక్స్, టైఫాయిడ్, ఎండలు, చెమటలు, చావు... వీటన్నింటినీ వెతుక్కుంటూ తిరిగి వచ్చేసేవారు.

ఇండియా తప్ప వారికి వేరే దేశం లేదు.

ఇది వారి దేశమే!

ఈ దేశాన్ని ఏలటం వారి బాధ్యత

అది దైవ నిర్ణయం.

దాన్ని మార్చటం ఎవరి తరం కాదు అన్నది వాళ్ళ నమ్మకం.

ఓల్డ్ ఇండియా హాండ్స్...& ఇండియా కుటుంబాలు ఎన్నో వున్నాయి... కాటన్స్, నికాల్‌సన్స్, థాంసన్స్, హావెలాక్స్, బర్డ్స్, బ్రౌన్స్, లారెన్స్, అన్సన్స్, బెవెర్స్, హామిల్టన్స్, థాకరే, హాబిన్సన్ — వీళ్ళందరూ ఇండియాని ప్రేమించి జీవిత కాలంలో ఎక్కువ భాగాన్ని ఈ దేశానికే అంకితం చేశారు.

ఫ్రాంక్లిన్ హావర్డ్ ప్యాట్రీషియా కాటన్‌ని పెళ్ళాడాడు. వాళ్ళ పిల్లలు ఇద్దరూ ఇంగ్లండ్‌లో చదువుకుంటున్నారు. వాళ్ళ ప్లాన్ ప్రకారం జేన్ ఐసియస్ ఆఫీసర్నో, మిలిటరీ ఆఫీసర్నో పెళ్లాడుతుందనీ, రాబర్ట్ ఆక్స్‌ఫర్డ్‌లో చదువు అయిపోగానే ఐసియస్‌లోకి ప్రవేశిస్తాడనీ, అంతా సవ్యంగా జరిగిపోతుందని అనుకుంటూ వచ్చారు.

కాని ఇప్పుడు ఏం జరుగుతోంది?

ప్లాన్స్ అన్నీ అస్తవ్యస్తంగా మారిపోతున్నాయి. ఏం జరుగుతున్నదో ఎవరికీ తెలియదు. గుడ్ లార్డ్! వాటీజ్ హాపెనింగ్?! ప్రశాంతమైన సరస్సు లాంటి తమ జీవితాల్లో ఎవరో ఓ బండరాయి విసిరి అలలు రేపి అల్లకల్లోలం చేశాడు.

తమ మిలిటరీ నుంచి రిటైర్ అయాక ముస్సోరీలోనో, సిమ్లాలోనో సెటిల్ అవుదామని నిర్ణయించుకున్నారు. ప్యాట్రీషియా పోరుతున్నది ఇల్లు కొందామని. ఇంకా టైమ్ వుంది అని తానే దాటవేస్తూ వచ్చాడు ఇన్నాళ్ళూ.

ఒకసారి ఇండియాలో పుట్టి పెరిగి ఇండియాలో పనిచేస్తే ఓ తరం గడిచేసరికి ఈ దేశం ఆ మనుషుల్ని మార్చేస్తుంది. తనలో కలిపేసుకుని వారిలో మార్పులు తెస్తుంది. వారి ప్రత్యేక గుణాలు, అలవాట్లూ అన్నింటినీ చెరిపేసి వారి ఆలోచనా సరళిలో గుర్తుపట్టలేని విధంగా మార్చేస్తుంది. ఆ మార్పులవల్ల వాళ్లలో వస్తుతపోవున్న గుణాలు — భాషాపరంగా, అలవాట్ల పరంగా... భోజనాలు, స్నానపానాలు... అన్నీ మారిపోతాయి. ఆ మార్పుల్ని వారు అసహ్యించుకుంటారు. కాని వాళ్ళు చేయగలిగిందేమీ లేదు. జియోగ్రఫీ, క్లైమేట్, నిర్దేశించే అనివార్యపు మార్పులివి.

ఈ వేడిలో వాళ్ళు ట్వీడ్ సూట్‌లు వేసుకోవడానికి వీల్లేదు. హెవీ టఫేటా, వెల్వెట్ గౌన్లు వేసుకుంటే చెమటతో ఉడికిపోతారు. మొదటగా వచ్చే మార్పులు వస్త్రధారణలో, ఎంత తక్కువ బట్టలు వేసుకుంటే అంత సుఖంగా వుంటుంది. కాటన్ షర్ట్‌లు, ఖాకీ నిక్కర్లు, కాటన్ ఫ్రాక్‌లు... మద్రాస్ కాటన్ గౌనులు, మల్లి గటానీ సూప్... స్పైస్ కలిపిన ఇండియన్ భోజనాలు... పలావులు... వాళ్ళ జీవితాల్ని మార్చేస్తాయి. ఇండియన్ పనిమనుషులు కాలుతీసి కాలుపెట్టకుండా పనులు చేసిపెట్టే ఇంగ్లీషు దొరల్ని, దొరసానుల్ని తిండిపోతులుగా, సోమరిపోతులుగా తయారుచేస్తారు.

ఇంటి నిండా డజన్లకొద్దీ సర్వెంట్స్.

ఇంగ్లండ్ వెళ్ళిపోతే ప్యాట్రీషియా తన బట్టల తానే ఉతుక్కుని, వంట తనే చేసుకోవాలి. అంతా మళ్ళీ నేర్చుకోవాలి. ఇన్నేళ్ళ సోమరితనం వదిలించుకోవాలి. ఏ పనీ చేయకుండా బలిసిన శరీరాలు మళ్ళీ కరిగి మామూలుగా అయిపోతాయి.

తన మిత్రులలోని కొందరి పరిస్థితి గురించి ఆలోచిస్తే హావర్డ్‌కి జాలివేసింది.


ఇంగ్లండ్‌లో వాళ్ళు పడబోయే బాధలు, ఇబ్బందులు వూహించడమే కష్టంగా తోచింది. పూర్ పీపుల్! ఇన్నాళ్ళూ అనుభవించిన సౌఖ్యానికి వాళ్ళు వడ్డీతో సహా తమ శ్రమతో, చెమటతో 'పే' చేస్తారు.

ఈ దేశం, ఈ మనుషులు, ఈ వాతావరణం, ఈ సర్వెంట్స్, ఈ సుఖాలూ అన్నీ దూరమైపోతాయి.

ఈ దేశంలో ఇంగ్లీషువాళ్ళు మూడు వందల ఏళ్ళుగా వున్నారు. దాదాపు రెండు వందల ఏళ్ళు పరిపాలించారు.

ఇండియన్స్ వాళ్ళని దేవుళ్ళులాగా చూసుకున్నారు. వాళ్ళకున్న వేలాది దేవతలతో పాటుగా పూజించి, విధేయత ప్రకటించి వారి పాలనలో ఆనందంగా గడిపారు. తెల్ల దొరలంటే వారికి గౌరవం, వారి మాట మీద గురి, వారి తెలివితేటల మీద, న్యాయదృష్టి మీదా ఎదురులేని నమ్మకం — అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ!!

హావర్డ్‌కి తెలుసు తాము చేసింది ఏమిటో. ఇండియన్స్‌ని అంతర్యుద్ధాలతో కొట్టుకు చావకుండా ఆపారు ఆంగ్లేయులు. వాళ్ళ చరిత్ర ఏమిటో వారికి తెలిపారు. విద్య నేర్పారు. సమానత్వం అన్న మౌలిక సామాజిక సూత్రానికి అర్థం చెప్పారు. ఒకనాడు మహోన్నతమైన సంస్కృతి కలిగి, వేలాది ఏళ్ళుగా దాడులతో దెబ్బతిని డార్క్




ఏజెస్‌లోనికి దిగజారిన వారికి తమ పూర్వ వైభవాన్ని తెలియజేశారు.

అసమానతలతో నిండిన ఈ దేశానికి ఐక్యత గూర్చి దేశానికో రూపాన్ని ఇచ్చారు. సివిల్ సర్వెంట్స్ ఇతరులు... తమ జీవితంలోని మంచి రోజులు ఈ దేశాన్ని మార్చడానికి, ప్రగతి దిశగా నడిపించడానికి వుపయోగించారు.

బ్రిటిష్‌వారు చేసిన సేవలకి ప్రతిఫలంగా తిరిగి ఈ దేశం వారికి ఏమి ఇచ్చింది?

అన్నీనూ — సర్వం ఇచ్చింది.

సామాన్య ఆంగ్లేయుడు ఈ దేశంలో బ్రతికిన విధానం ఇంగ్లండ్‌లో నోబుల్స్... డ్యూక్స్... డచెస్‌లు, ఎర్ల్స్... కౌంట్‌లు... లార్డ్‌లు... వంటివారికి మాత్రమే అందుబాటులో వుండేది. ఎందరో సేవకులు... ఇంగ్లీషువాళ్ళు నడిచిన నేలను పూజించాలనే మనస్తత్వం వున్న అమాయకులు. చెప్పిన పనిని ఎదురు మాట చెప్పకుండా చేసే సర్వెంట్స్... ఇండియా మొత్తాన్ని ఆవరించిన భయంకర దరిద్రపు మహా సముద్రంలో మధ్య వుండే లక్షరీ ద్వీపాల్లా ఇంగ్లీషు సమాజం బ్రతికింది. వారి భోగభాగ్యాలు వూహించరానివి. రోజులన్నీ హాలిడేస్! ప్రతి రోజూ పార్టీలు! ఆర్గీల్లాంటి రోజులు... తాగుడు... తిండి... మజా... పార్టీలు... బార్‌లు... జింఖానాలు... షూటింగ్ పార్టీలు... పోలో గేమ్స్... పిగ్స్ స్టికింగ్... బ్రిడ్జ్... టెన్నిస్... గోల్ఫ్...

ఈజీ లైఫ్... లక్షరీ లైఫ్... డ్రీమీ లైఫ్.

బాధ్యతలు తక్కువ... అంతులేని అధికారం... చేతి నిండా డబ్బు... గడపడానికి ఎంతో కాలం... లీజర్...

ఇండియాలోని పేదరికం వీరికి పట్టలేదు. డ్రాయింగ్ రూమ్స్‌లో, కాక్‌టైల్

# మయూరి

## సచిత్ర వారపత్రిక

సీరియల్స్

- తెలుగులో తొలిసారిగా ఒకే ప్రదేశంలో కథ జరుగుతోంది.
  అదే సస్పెన్స్ పితామహుడు
  మల్లాది వెంకటకృష్ణమూర్తి సీరియల్
  **తొమ్మిదిగంటలు**
- చందుసోంబాబు **నాట్ నౌ డార్లింగ్**
- శాతవాహన **అసురపంజరం**
- జి.వి.అమరేశ్వరరావు **బోయ్ ఫ్రెండ్**
- త్వరలో ప్రారంభం
  యం.డి.చైతన్య **కాల్‌గర్ల్**

ఇవిగాక సంచలనం సృష్టిస్తున్న
సత్యవర్థన్ **డెడ్‌లైన్ కథలు**

మరో ఆరుకథలు
ఓ శృంగార కథ
వారం వారం నేరపారాయణం, సినిమా సినిమా, పురాణరాజకీయం, ప్రేమలేఖలు, వీక్లీకామెంట్, కవితాలహరి, కొత్తపుస్తకాలు, అమృతవర్షిణి, మహిళాలోకం, బాలమయూరి, కార్టూన్లు, జోకులు

ఇవన్నీ కేవలం మూడురూపాయలకే

చదవండి చదివించండి

**మయూరి** **మయూరి**
సచిత్ర వారపత్రిక సచిత్ర వారపత్రిక


పార్టీలలో, క్లబ్‌లో, పిక్నిక్‌లలో బీదరికాన్ని గురించి మాట్లాడడం భయంకరమైన తప్పు... క్షమించరాని నేరం... ఫాక్స్ పాస్... ఎవరైనా నేటివ్స్ మీద జాలి చూపిస్తే వెంటనే స్టాంప్ పడిపోతుంది. నిగ్గర్ లవర్! బ్లీడింగ్ హార్ట్! అలాంటివారిని సోషల్ గ్రూపు నుంచి అంటరానివారిగా వెలివేయడం జరిగేది.

ఇండియన్స్ సమస్యలు పైపైన చూసి వాటికి సొల్యూషన్స్ వెదకడం మామూలు... ఎవరైనా అతిగా పోతే వెంటనే సీనియర్స్ వారికి బుద్ధి చెప్పి సరైన దారిలో పెట్టేవారు... అయినప్పటికీ కొందరు తాము నమ్మిన మార్గాల్లో పయనించి తాము వూహించని విధంగా సిన్సియర్‌గా సమస్యలకి పరిష్కారం కనుగొనడానికి కృషి చేసేవారు. చరిత్ర మార్చేవారు. కాటన్... నికల్‌సన్... లారెన్స్... థామస్ మున్రో... ఇంకా ఎందరో

ఒకటే సలహా. నువ్వు బ్యూరోక్రాట్‌గా సమస్యల్ని పరిష్కరిస్తావా? లేక సంస్కర్తలాగా ప్రవర్తిస్తున్నావా? అన్నది ముఖ్యమైన ప్రశ్న. సంస్కర్తవి కావాలంటే ఉద్యోగం నుంచి రిజైన్ చేసి ఏ బడిపంతులువో లేక ప్రీచర్‌వో అయి సేవ చేయాలన్నది సమాజపు నమ్మకం. బ్రిటిష్ సమాజం ఈ విషయంలో నిర్దాక్షిణ్యంగా వుండేది.

స్నానం చేసి వచ్చేసరికి బెడ్ మీద పెట్టివున్న సెరెమోనియల్ యూనిఫారమ్, టోపీ, మెడల్స్, స్వోర్డ్, మెరిసేలా పాలిష్ చేసిన బూట్లు అన్నీ సిద్ధంగా వున్నాయి.

డ్రెస్సింగ్ గౌన్‌లోనే బ్రేక్‌ఫాస్ట్ ముగించి డ్రెస్ చేసుకుంటూ ఓ పాటని విజిల్ చేశాడు కల్నల్ ఫ్రాంక్లిన్ హోవార్డ్. అది వందేమాతరం గీతానికి బూతుపేరడీ. దానిని క్లబ్‌లో నవ్వించడానికి పాడుతుండేవారు. విజిల్ వేస్తూ ఆలోచిస్తున్నాడు.

ఈ రోజు ఉదయం ఎనిమిదన్నర గంటలకి ఇండియన్ ఆర్మీ యూనిట్స్ బ్రిటిష్ వారి నుంచి మిలిటరీ పెత్తనాన్ని అధికారికంగా స్వీకరించబోతోంది.

తర్వాత?

ఏముంది?

**Kick the English in the arse and send them back to England, where they belong!!**

**Back home to England! Old Boy!!**

హోవార్డ్ నిట్టూర్చాడు.

ఎనిమిది గంటలకి మేజర్ బేట్స్ వచ్చి సెల్యూట్‌చేసి అన్నాడు —

"గుడ్ మార్నింగ్ సర్. అంతా సిద్ధం."

"వేరీ వెల్ మేజర్ బేట్స్"

బేట్స్ కళ్ళు వాచి వుండడాన్ని గమనించాడు హోవార్డ్. రాత్రి నిద్రపోయినట్టుగా లేదు. కళ్ళు జ్యోతుల్లాగా ఎర్రగా వున్నాయి. కనురెప్పలు వాచి వున్నాయి.

ఏడిచాడా? పాపం తెల్లవాడు!

బయట జీప్ రెడీగా వుంది.

సోమర్సెట్ లైట్ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ యూనిఫామ్స్‌లో స్మార్ట్‌గా సిద్ధంగా వుంది. కాని అందరు బ్రిటిష్ జవాన్స్ మొహాల్లో చెప్పలేని నిరాశ.

ఈ పెరేడ్ ఎరేంజ్ చేసింది బొంబాయిలోని గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర.

పెరేడ్ మొదలైంది.

బ్రిటిష్‌వారికి ఇండియాలో ఇది లాస్ట్ పెరేడ్.

ఫేర్‌వెల్ పెరేడ్!

ఇండియన్ సిపాయిలు, బ్రిటిష్ సోల్జర్స్ కలిసి ఎన్నో యుద్ధాల్లో పాల్గొన్నారు. వారి రక్తం ఫ్రాంటియర్ యుద్ధాల్లో చిందింది. గూర్ఖాలూ, సిక్కులూ, మదరాసీలూ, బెంగాలీలూ... అందరూ కలిసి కవాతు చేసేవారు.

వారు పాల్గొన్న యుద్ధాలు కొన్ని ధర్మ యుద్ధాలు.

కొన్ని అధర్మ యుద్ధాలు.

కాని సుశిక్షితుడైన సైనికుడికి యుద్ధానికి కారణాలు అవసరం లేదు. పై అధికారుల ఆజ్ఞ ప్రకారం నడుచుకోవడం అతడి విధి. ఆ డిసిప్లిన్ లేనిదే ఏ సైన్యమూ మన లేదు.

ధర్మాధర్మ సూక్ష్మాల్ని నిర్ణయించేది కాలం. చరిత్ర ఆనాటి పెరేడ్‌ని ఆర్మీలోని శిఖ్ రెజిమెంట్‌కి చెందిన లెఫ్టినెంట్ కలనల్ ప్రీతిపాల్ సింగ్ కమాండ్ చేశాడు.

బ్రిటిష్ వారి సోమర్సెట్ లైట్ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ జవానులు వాళ్ళ టోపీల మీద 'జలాలాబాద్' అని రాసి వున్న ఎంబ్లెమ్‌ని ధరించి వున్నారు. ఆ మాట వెనక చరిత్ర వుంది. బ్రిటిష్ వారు హిందూ దేశపు నేల మీద చేసిన అతి అన్యాయపు యుద్ధానికి అది చిహ్నం. ఆ యుద్ధంలో బ్రిటిష్ వారు చావు దెబ్బతిని వున్నారు.

పెరేడ్‌లో పాల్గొన్న ఇంగ్లీష్ బటాలియన్‌కి ఇండియన్ ఆర్మీ ఓ జ్ఞాపికను బహూకరించింది.

అది గేట్ వే ఆఫ్ ఇండియా మోడల్

దాని మీద వున్న మాటలు

బ్రిటిష్ - ఇండియా సిపాయిల సహచర్యానికి చిహ్నంగా.

తేదీ 1754 - 1947

ప్రథమంగా 1754వ సంవత్సరంలో ఇంగ్లీష్ ఆర్మీ ఈ గడ్డ మీద కాలు పెట్టింది.

ఆ బెటాలియన్?

డార్సెట్ షైర్ రెజిమెంట్ తాలూకు ఫస్ట్ బెటాలియన్

తరువాత పెరేడ్ మొదలైంది.

స్మార్ట్‌గా టర్న్ అవుట్ అయిన ఈ క్రింది ఇండియన్ మిలిటరీ బెటాలియన్లు వరసలో మార్చ్ చేశాయి.

ఇండియన్ గ్రెనేడియర్స్

మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ సెకండ్ రాయల్ బెటాలియన్

సిఖ్ రెజిమెంట్

అయిదవ రాయల్ గూర్ఖా రైఫిల్స్

వీరందరూ రాయల్ సెల్యూట్‌లో ఆయుధాలు ప్రెజెంట్ చేశారు.

ఇండియన్ బాండ్స్ అన్నీ కలిసి "గాడ్ సేవ్ ది కింగ్" వాయించాయి.

దీనికి సమాధానంగా

సోమర్సెట్ లైట్ ఇన్ ఫాంట్రీ రాయల్ సెల్యూట్‌లో ఆయుధాలు ప్రెజెంట్ చేసినప్పుడు ఇంగ్లీషు బాండ్ వందేమాతరం వాయించింది.

అది మరువరాని క్షణం.

ఇంగ్లీషు వారి కళ్ళలో నీళ్ళు చిమ్మాయి.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు అస్తమయం ఆ క్షణంలో జరిగినట్టుగా వారికి అనిపించి వారి గుండెల్లో గూడు కట్టుకున్న వ్యథ అంతా ఒక్కసారిగా పెల్లుబికి వారికి అనిర్వచనీయమైన మహావేదన కలిగించింది.

వందేమాతరం!

ఒకనాడు వారు నిషేధించిన పాట!

వెటకారంగా పేరడీ చేసి నవ్విన కామెడీ సాంగ్!!

ఏదో ఒకనాడు అది భారతదేశపు జాతీయగీత మౌతుందని ఆంగ్లేయులెవరూ తమ కలల్లో కూడా వూహించలేదు.

కొన్నేళ్ళవాడు ఆ పాట స్వాతంత్ర్య సమర యోధులకి పథగీత మౌతుందని, ఆ గీతంలో పొందుపరచిన జాతీయ భావాలలో భాగమైపోతుందని, కోట్లాది భారతీయులు ఎన్నో సంవత్సరాలు ప్రతి రోజూ గర్వంగా గళమెత్తి ఆ పాటను పాడుకుంటారని పాలకులకి తెలియ లేదు.

పాలకులకి, పాలితులకి వున్న ఘర్షణలో ఇలాంటివి జరగడం మామూలే.

అన్ని రెజిమెంట్సు, అన్ని రంగుల యూనిఫారమ్స్‌లో వున్న జవానులు, ఆఫీసర్లు గేట్ వే ఆఫ్ ఇండియా క్రింద మంచి మార్చ్ చేస్తుండగా సుహృద్భావానికి, స్నేహానికి, సమశీలతకీ ప్రతీక అయిన సెంటిమెంటల్ సాంగ్ "ఆల్డ్ లాంగ్ సైన్" వాయించారు. అన్ని బాండ్స్ ఏకంగా కలిసి

**Should Auld Acquiantance be forgotten**
**And never brought to mind**

రెండు దేశాల మిలిటరీలు కలిసి మార్చ్ చేశాయి. ఒకే బీట్‌కి అడుగులు వేస్తూ, ఒకే పాటకి స్పందిస్తూ -

అప్పుడు నిజంగా అంతా అయిపోయింది.

ఎండ్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ ఇన్ ఇండియా!

కల్నల్ ఫ్రాంక్లిన్ హోవార్డ్ నీలికళ్ళ నిండా నీళ్ళు నిలిచాయి.

పెరేడ్‌లో ఏడవం అబ్సర్డ్

**Pull yourself toghter, Old Boy!!**

పూర్ హోవార్డ్! మార్పులు తెచ్చే సమయంలో చరిత్ర శక్తులు నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తాయి. అదే సమయంలో రక్తపాతం జరుగుతున్నది. సోదరులు ఒకరినొకరుకోసుకుంటూ మారణహోమంలో ఉత్తర భారతాన్ని రక్తపు వరదతో తడుపుతున్నారు.

స్వాతంత్ర్యానికి రథసారధి అయిన మహాత్మా గాంధీ ఆ సమయంలో ఢిల్లీలో లేరు. కలకత్తాలో వుండి నవ ఖాలీ దురంతాలను అదుపుచేయడానికి ప్రయత్నిస్తున్నారు.

చీలుతున్న దేశం మీద రక్తపుచారికలు పడుతున్నాయి. లక్షలాది ప్రజలు ఇళ్ళూవాకిళ్ళూ వదిలేసి కట్టుగుడ్డలతో తెలియని ప్రాంతాలకి వలస పోతున్నారు. కాందిశీకులుగా... అనాధలుగా... బిచ్చగాళ్ళుగా...

మత మౌఢ్యపు భయంకర శక్తులు వికృత నృత్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. కోరలువిప్పి బాహాటంగా తమ రూపాల్ని చూపిస్తూ నరమేధపు జ్వాలల్లో నిండు ప్రాణాల్ని పొట్టన పెట్టుకుంటూ తమ పనులుచేసుకుపోతున్నాయి.

దీనికి కారణం బ్రిటిష్ వారి పాలసీ విభజించి పాలించు చారిత్రక వారసత్వాల్లో లభించినవి ఇంకా ఎన్నో కారణాలు కూడా వున్నాయి. అవి అంత సులభంగా అర్థం కావు. అవి ఒంటరి మనుషుల సమస్యల్ని తీర్చలేవు.

తల ఎత్తి సూర్యుడి వంక చూస్తూ స్మార్ట్‌గా స్టెప్స్ వేస్తున్నాడు కల్నల్ ఫ్రాంక్లిన్ హోవార్డ్. అతడి కళ్ళలోని నీరు ఇగిరిపోతోంది.

అతడి మనసులో ప్యాట్రీషియా.

ఇంటిలో సామాన్లని పేక్ చేస్తోంది అనుకున్నాడు.

బళ్ళకొద్దీ సామాన్లు

ఏవి వదిలి వెయ్యాలో, ఏవి వెంట తీసుకుపోవాలో నిర్ణయించడానికి సమయం చాలదు.

క్విక్ డెసిషన్స్!

ఓ గాడ్!

సమస్యల వలయంలో ఇరుక్కున్న హోవార్డ్ మైండ్ ఎక్కడో వుంది.

కాని అతడి కాళ్ళు లయతప్పకుండా మార్చ్ చేస్తున్నాయి.

ఒన్ టు

ఒన్ టు

చరిత్ర మారుతోంది.

పెరేడ్ పూర్తయాక అలసటతో ఇంటికి చేరాడు హోవార్డ్. ఎండలో కాలిపోయిన చర్మం మండుతోంది. చెమటతో యూనిఫారమ్ తడిసి పోయింది.

డ్రాయింగ్ రూమ్‌లోకి కాలుపెట్టగానే చూశాడు. ప్యాట్రీషియా చేతుల్లో ముఖాన్ని కప్పుకుని సైలెంట్‌గా ఏడుస్తోంది. ఆమె వేసుకున్న ఫ్రాక్ దుమ్ముతో డర్టీగా వుంది. దుఃఖంతో ఆమె భుజాలు ఎగురుతున్నాయి.

పూర్ పాట్!

సామాన్లు సర్దుకోలేక అలిసిపోయి ఏడుస్తోంది అనుకున్నాడు. అనురాగంతో అతడి గుండె నిండిపోయింది.

తన బూట్ల అలికిడికి మెల్లగా తలెత్తింది. ఆమె కళ్ళు వాచి వున్నాయి. ధారా పాతంగా కారిన కన్నీళ్ళతో ఫ్రాక్ ముందు భాగం తడిసి పోయి వుంది. చెమటతో ముంగురులు ఫాలభాగానికి అతుక్కు పోయివున్నాయి.

"డార్లింగ్ పాట్? ఎందుకు ఏడుస్తున్నావు?"

అప్పుడు సుడిగాలిలా లేచింది ప్యాట్రీషియా హోవార్డ్. శివమెత్తినట్టుగా వూగిపోయింది.

"ఫ్రాంక్ నేను ఇక్కడి నుంచి ఇంగ్లండ్‌కి రాను. ఎందుకు రావాలి? ఈ బంధాల్ని తెంచుకుని, ఈ గందరగోళంలో అర్ధాంతరంగా కాందిశీకులుగా మనం ఎందుకు వెళ్ళాలి. అలా పంపించడానికి ఎవరికి హక్కు వుంది? ఆ హక్కు ఎవరు ఇచ్చారు. నీకు తెలుసా ఫ్రాంక్ మా అమ్మమ్మ, అమ్మ, నేను, నా కూతురు అందరం ఇక్కడే పుట్టాం. ఇక్కడి నుంచి పొమ్మనడానికి ఎవరిచ్చారు అధికారం? ఈ దేశంలో ఇన్ని తరాలుగా పుట్టి పెరిగిన మనకు ఏమీ హక్కులు లేవా? ఈ క్షణంలో అన్ని అంతరించి పోయాయా? ఫ్రాంక్! ఫ్రాంక్! నేను ఇండియా వదిలి వెళ్ళలేను. నేను ఇంగ్లండ్‌లో వుండలేను. నాకక్కడ ఎవరూ తెలియదు. నేనక్కడ ఎవర్ని? ఏమీకాను.

భోరున ఏడుస్తూ ఫ్రాంక్ హోవార్డ్ గుండెల మీద పడింది ప్యాట్రీషియా.

వాళ్ళ చుట్టూ అస్తవ్యస్తంగా సామాన్లు గది నిండా పడివున్నాయి. కుర్చీలు, టేబుల్స్, పెట్టెలు, రకరకాల బట్టలు, చెప్పులూ, బూట్లు, రైడింగ్ షూస్, డాన్సింగ్ షూస్, ప్లేట్లు, స్పూనులు, టిన్డ్ ఫుడ్, విరిగిపోయిన టాయ్స్, గన్స్, పిస్టల్స్, బీరు సీసాలు, ఏమిటేమిటో వస్తువులు... వాళ్ళ జీవితాలకి సంబంధించినవి... వాళ్ళువాడినవి. వాళ్ళ పిల్లలు పెరుగుతూ ఆడుకుని పారేసినవి... పుస్తకాలు... మ్యాగజైన్స్... లండన్ స్టోర్స్ కేటలాగులు... ఏమిటేమిటో వున్నాయి. పేకేజింగ్ కేసెస్... సూట్ కేసెస్... ట్రంక్ పెట్టెలు... ఓక్‌వుడ్ బాక్సెస్... అల్లకల్లోలంగా వున్న ఉత్తర భారతంలా... చెల్లా చెదురు అయి ముక్కలు కాబోతున్న బ్రిటిష్ సామ్రాజ్యంలా...

అందులో వారిద్దరూ అసహాయంగా నిలబడి వున్నారు. ◆